క్లుప్తంగా

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

కంది(సంగారెడ్డి): కంది మండల పరిధిలోని తుంకిల్ల తండాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించనున్నట్లు బంజారా ఎంప్లాయిస్ సేవా సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

బీజేపీలో చేరిక



సంజీవులుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ బీబీ పాటిల్

నారాయణఖేడ్: వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేసిన తెలంగాణ పోలీసు ఉద్యమకారుడు బోర్గి సంజీవులు జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో శుక్రవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సంజీవులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎస్సీల వర్గీకరణకు కమిటీని వేయడం ద్వారా మాదిగలకు న్యాయం జరుగుతుందనే నమ్మకంతో బీజేపీలో చేరినట్లు తెలిపారు. ఎంపీగా బీబీ పాటిల్ మళ్లీ గెలిచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీరప్ప బస్తీలో శుక్రవారం చలివేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలసుబ్రహ్మణ్యం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రఫీ, నాగరాజు, కిరణ్, సునీల్ పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ ఖరారుతో సంబురాలు



టపాకాయలు కాలుస్తున్న నాయకులు

నారాయణఖేడ్: జహీరాబాద్ పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా సురేష్‌కుమార్ షెట్కార్‌కు ఆ పార్టీ అధిష్టానం ప్రకటించడంతో ఖేడ్‌లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు టపాకాయలు కాల్చి ఘనంగా సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రషీద్, తాహెర్‌అలీ, సాయిలుపటేల్, వివేకానంద్, నెహ్రూనాయక్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



కిరణతేజ

రామచంద్రాపురం (పటాన్‌చెరు): డబ్బుల విషయంలో తండ్రి మందలించడంతో ఓ యువకుడు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటన బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో నివాసం ఉండే కిరణ్‌తేజ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కాగా డబ్బుల విషయంలో అతని తండ్రి మందలించడంతో కిరణ్‌తేజ గురువారం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అతని ఆచూకీ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కిరణ్‌తేజ కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



జహీరాబాద్ టౌన్: పట్టణ సమీపంలో బైపాస్ రోడ్డులో శుక్రవారం గుర్తు తెలియని శవాన్ని గుర్తించారు. జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అల్గోల్ చౌరస్తా వద్ద ఉన్న కల్వర్టు కింద ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవన్నారు. శవాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి భద్రపరిచినట్లు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించిన వారు సమాచారం అందించాలని సూచించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు తప్పని కష్టాలు

- జొన్నపంటకు అడవి పందులు, కోతులు, పిట్టల బెడద
- ఆందోళనలో అన్నదాతలు
- పంటను కాపాడుకునేందుకు పాట్లు



జొన్న పంటను కాపాడుకునేందుకు చుట్టూ వలలు ఏర్పాటు చేసిన రైతులు

కల్హేర్(నారాయణఖేడ్): యాసంగి పంటల కింద రైతులు జొన్న పంటలను ఎక్కువగా సాగు చేశారు. అయితే.. పంట చేతికొచ్చే సమయంలో రాత్రి అడవి పందులు, పగలు కోతులు, పక్షులు పంటను నాశనం చేస్తున్నాయి. దీంతో రైతన్నలకు కష్టాలు తప్పడంలేదు. జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టు నల్లవాగు ఆయకట్టుతో సహ కల్హేర్, సిర్గాపూర్ మండలాల రైతులు యాసంగిలో దాదాపు 3వేల ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికోచ్చే దశలో ఉండగా అడవి జంతువుల బెడదతో రైతులను వేదిస్తోంది.

ఎకరాకు రూ.2వేల నుంచి 3వేల పెట్టుబడి

తక్కువ నీటి వాడకం ఉండటంతో యాసంగిలో రైతులు జొన్నపంట సాగు వైపు దృష్టి సారించారు. కల్హేర్, మార్డి, కృష్ణాపూర్, బీబీపేట, బాచేపల్లి, రాపర్తి, మాసాన్‌పల్లి, నాగధర్, ఫతేపూర్, సిర్గాపూర్, కడ్పల్, వాసర్, ముబారక్‌పూర్, అంతర్‌గాం, తదితర చోట్ల జొన్న పంటలను ఎక్కువగా సాగుచేశారు. పంట సాగులో ఎకరాకు రూ.2 వేలు నుంచి రూ.3వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వచ్చిందని రైతులు తెలుపుతున్నారు. కానీ.. పందులు, కోతులు, పక్షుల బెడదతో పెట్టిన పెట్టుబడులైనా వస్తాయో.. రావోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు తప్పడంలేదు



రబీలో ఒక ఎకరం జొన్నపంట వేశాను. ఇప్పటికే పంట సంరక్షణ కోసం పురుగుల మందు స్ప్రే చేశాను. నెల రోజుల్లో చేతికోస్తది. ఆశించినంత జొన్నకంకులు కాలేదు. దిగుబడి తగ్గే అవకాశం ఉంది. పిట్టలు, అడవి పందులు, కోతుల బెడదతో ఇబ్బందులకు గురవుతున్నాం.

– నర్సింహులు, రైతు, మార్డి

పంటను రక్షించుకునేందుకు పడరాని పాట్లు..

అడవిపందులు, పిట్టల బెడద నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. పంట చేతికోచ్చే దశలో ఉండటంతో రక్షించుకోవడం రైతులకు సవాల్‌గా మారింది. దీంతో పంట చేల చుట్టూ చిరిగిన బట్టలు, ఖాళీ వాటర్ బాటిళ్లు, వలలు ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి సమయాల్లో పంట చేల వద్ద మంటలు వేసుకోవడం, టపాసులు కాల్చడం వంటి చర్యలు చేపడుతున్నారు.

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లండి
- సీసీఎంబీ శాస్త్రవేత్త డాక్టర్ విష్ణుప్రియ
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



పటాన్‌చెరు టౌన్: మాట్లాడుతున్న సీసీఎంబీ శాస్త్రవేత్త విష్ణుప్రియ

పటాన్‌చెరు టౌన్: దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని సీసీఎంబీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ విష్ణుప్రియ అన్నారు. పటాన్‌చెరు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విష్ణుప్రియ మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలన్నారు. సవాళ్లు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కొవాలని సూచించారు. నేడు మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తుండటం హర్షనీయమని వివరించారు. కార్యక్రమంలో పోషకాహార నిపుణురాలు, డైటీషియన్ శుభాంగి తమ్మాళ్వార్, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ మాధవి, మహిళా విభాగం సమన్వయకర్త డాక్టర్ ప్రసన్నలక్ష్మి, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల హక్కులను కాపాడుకోవాలి..

కంది(సంగారెడ్డి): మహిళల హక్కులను కాపాడుకోవాలని ఓడిఎఫ్ డీజీఎం రంగబాయి అన్నారు. మండల పరిధిలోని ఎద్దుమైలారం ఆయుధ కర్మాగారం (ఓడీఎఫ్) ఎస్టేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రపతి, గవర్నర్లు, కలెక్టర్లతో పాటు వివిధ ఉన్నత హోదాల్లో మహిళలు ఉండటం గర్వకారణమన్నారు. మహిళలు విద్యా, వైద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణిస్తుండటం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో ఓడీఎఫ్ జీఎం ప్రసాద్, మాజీ ఏజీఎం సుజాత, హెచ్‌ఆర్ జీఎం మోహన్, జూనియర్ వర్క్స్ మేనేజర్ రమాదేవి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

మహీంద్ర ట్రాక్టర్ ప్లాంట్ కర్మాగారంలో...

జహీరాబాద్: పట్టణంలోని మహీంద్ర కర్మాగారంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా ఉద్యోగులు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు సమానంగా రాణిస్తున్నారన్నారు. అనంతరం వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. మహీంద్ర డీజీఎం ప్రదీప్‌గౌడ్, ఫైర్ అధికారి అనీష్, అడ్మిన్ ఆఫీసర్ జలంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీహెచ్‌ఈఎల్ కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ కమ్యూనిటీ సెంటర్‌లో ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బెల్ ఈడీ భరణిధర్ రాజా పాల్గొని మహిళా ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటారు. జీఎం చంద్రశేఖర్, అధికారులు సుజన, బీతిక నోహ తదితరులు పాల్గొన్నారు.



కంది: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పాల్గొన్న ఉద్యోగులు



మొక్కలు నాటుతున్న బెల్ ఉద్యోగులు

దర్గా ఉత్సవాలకు పటిష్ట భద్రత



దర్గా పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ అనిల్‌కుమార్

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లిలోని వెంకటఖ్వాజా దర్గా ఉత్సవాల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జోగిపేట సీఐ అనిల్‌కుమార్ అన్నారు. వట్‌పల్లిలో వెంకటఖ్వాజా దర్గాను శుక్రవారం సందర్శించారు. అనంతరం దర్గా ట్రస్టు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో తరలిరానుండటంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ దర్గాను దర్శించుకోనుండటంతో కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో ట్రస్టు ఉపాధ్యక్షుడు రాములు చిస్తీ, ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు, సుందర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

జియో ట్యాగింగ్ రద్దు చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): జియో ట్యాగింగ్ సిస్టంతో ఉపాధిహామీ కూలీలు, ఫీల్డ్‌అసిస్టెంట్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు అన్నారు. ఆ సంఘం కొండాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కోనాపూర్‌లోని ఉపాధిహామీ కూలీల పని ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ.. పని ప్రదేశంలో కూలీలకు పనిముట్లు, టెంట్లు, మంచినీరు, మెడికల్ కిట్ల లాంటి సౌకర్యాలను కల్పించడం లేదన్నారు. రోజుకు రూ.800 కూలి ప్రకటించి 200 రోజుల పని దినాలను కల్పించాలని డిమాండ్ చేశారు. జియో ట్యాగింగ్ సిస్టంను రద్దు చేసి పెండింగ్‌లో ఉన్న ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాములు, ఆంజనేయులు, మల్లేశం, రాములు, రసూల్, పాండు, మల్లేశం, శేఖర్, లక్ష్మి, సుగుణమ్మ, వెంకటయ్య, రత్నయ్య పాల్గొన్నారు.

పోలీస్ కవాతు

చిన్నశంకరంపేట(మెదక్): పార్లమెంట్ ఎన్నికలు సమీస్తున్న నేపథ్యంలో శుక్రవారం మండల కేంద్రంలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నారాయణగౌడ్ మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ బాలస్వామి ఆదేశాలతో పారా మిలటరి బలగాలతో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. శాంతి భద్రతల రక్షణకు పోలీస్ వ్యవస్థ ముందుండి ప్రజాస్వామ్య వ్యవస్థను ముందుకు తీసుకెళ్లేందుకు శాంతియుత వాతవారణం కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు.

జాతర సందడి.. అద్దెకు ఎడ్లబండి



అద్దెకు తెచ్చిన ఎడ్లు, బండితో భూపాల్

పాపన్నపేట(మెదక్): ఒకప్పుడు పల్లెల్లో ఇంటింటా ఎడ్ల బండ్లు ఉండేవి. యాంత్రిక యుగంలో దాదాపు కనుమరుగయ్యాయి. కాని ఆచార వ్యవహారాలు, జాతరలు, అంగళ్లు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో తప్పని పరిస్థితిలో వ్యయ ప్రయాసల కోర్చి ఎడ్లు, బండ్లను అద్దెకు తెచ్చుకొని జాతరలో బండ్లు తిప్పడానికి సిద్ధమవుతున్నారు. పాపన్నపేట మండలం ఎల్లాపూర్‌కు చెందిన భూపాల్ ఏటా ఏడుపాయల జాతరలో ఎడ్లబండి తిప్పుతాడు. అయితే తన వద్ద లేకపోవడంతో ఆచారాన్ని కొనసాగించడానికి టేక్మాల్ మండలం తంపులూర్‌లోని ఓ రైతు వద్ద సుమారు రూ.10 వేల ఖర్చుతో అద్దెకు ఎడ్లు, బండ్లు తీసుకొచ్చాడు. శనివారం ఏడుపాయల జాతరలో తిప్పేందుకు సిద్ధమయ్యాడు.

మది నిండా.. శివనామస్మరణ

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి ● కిటకిటలాడిన ఆలయాలు

జిల్లావ్యాప్తంగా మహాశివరాత్రి పండుగను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలు శివనామస్మరణతో మారుమోగాయి. ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి దీక్షలు విరమించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



సదాశివపేట: పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



పటాన్‌చెరు టౌన్: పూజలు చేస్తున్న నీలం మధు



జహీరాబాద్ టౌన్: ప్రత్యేక అలంకరణలో మార్కండేశ్వర ఆలయంలోని శివలింగం



పటాన్‌చెరు: ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో మల్లికార్జునస్వామి ఆలయ నిర్వాహకులు..



సంగారెడ్డి టౌన్: శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు



ఖేడ్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



జిన్నారం: జిన్నారంలో శివపార్వతుల ఊరేగింపులో...



ఝరాసంగం: కేతకీ ఆలయం వద్ద పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



జహీరాబాద్: కైలాసగిరి శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



రామచంద్రాపురం: తెల్లాపూర్ శివాలయంలో...